RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 329 | బుధవారం | 05 - 06 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

# దేశ తదుపరి ప్రధాని ఎవరు..?



- 294 స్థానాలు గెలుచుకున్న ఎన్డీయే
- 231 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్
- మోదీకి ఛాన్స్ ఇస్తారా?
- కూటమిలో చంద్రబాబుకు కీలక పాత్ర
- కూటమిలోని మోదీ వ్యతిరేకులంతా ఏకమవుతారా?

2

## బలంగా మారిన హైదరాబాద్ పోలీస్ శాఖ




2

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణ రాష్ట్ర పదేళ్ల పాలనలో పోలీస్ శాఖ పటిష్టమైంది. వేలాదిమంది నూతన సిబ్బంది

## ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటాం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిం

3

## ఏపీలో కూటమి అఖండ విజయం



అమరావతి, ప్రభాత సూర్యుడు : ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం దిశగా వైసీపీ కొనసాగుతోంది. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న టీడీపీ సంబరాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు నాయుడు ఇంట్లో కుటుంబ సభ్యుల సంబరాలు

3

## తెలంగాణలో అనూహ్య ఫలితాలు

- కాంగ్రెస్-బీజేపీ మధ్య టైట్ ఫైట్ నడిచింది
- మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో అనూహ్య ఫలితాలు
- హైదరాబాద్‌ను ఎమ్ఐఎమ్ దక్కించుకుంది





హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో మరోసారి ఎగ్జిట్ పోల్స్ అంచనాలే ఫలితాల రూపంలో నిజమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పగా.. అలాగే ఆ పార్టీ అధికారం చేపట్టింది. ఇప్పుడు అవే ఎగ్జిట్ పోల్స్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ అని అంచనా వేశాయి. తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్-బీజేపీ మధ్య టైట్ ఫైట్ నడిచింది. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్- బీజేపీ మధ్య చివరి వరకూ హోరాహోరీ నడిచింది. చెరో 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఇక ఎప్పటిలాగే మజ్లిస్ కంచుకోట హైదరాబాద్‌ను ఎమ్ఐఎమ్ దక్కించుకుంది. ఇక్కడ ఆశ్చర్యపోయే విషయం ఏంటంటే.. విపక్ష బీఆర్ఎస్ పార్టీ ఎక్కడా ప్రభావం చూపకపోవడం గులాబీశ్రేణులను తీవ్రనిరాశలోకి నెట్టేసింది. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ మొత్తం 8 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. అందులో పెద్దపల్లి, జహీరాబాద్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భువనగిరి, నల్గొండ, నాగర్‌కర్నూలులో కాంగ్రెస్

2

## రాష్ట్ర ప్రజల కష్టాలే నా కష్టాలుగా భావించా



4

## కవితకు బిగిస్తున్న ఉచ్చు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ కవితకు రౌస్ అవెన్యూ కోర్టు షాక్ ఇచ్చింది. సీబీఐ కేసులో ఆమె జుడీషియల్ కస్టడీని జూన్ 7వ

2



# దేశ తదుపరి ప్రధాని ఎవరు?




**న్యూఢిల్లీ,** ప్రభాత సూర్యుడు : దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఫలితాలూ వచ్చేశాయి.. కానీ, ఇక్కడే పెద్ద ట్విస్ట్ ఇచ్చారు ఓటర్లు. ఎవరికీ పూర్తిస్థాయి మెజార్టీ ఇవ్వకపోవడంతో.. మళ్లీ సంకీర్ణ సర్కార్ అనివార్యమైంది. దీంతో అసలు చర్చ ఇప్పుడే ప్రారంభమైంది. ఇంతకాలం మోదీ 3.0 సర్కార్ వస్తుందని అంతా అనుకున్నా.. సీన్ రివర్స్ అయ్యింది. ఎగ్జిట్ పోల్స్ ఎగబడి ఎగబడి.. మోదీ నామం జపించినా.. అన్నీ ఉత్తి ముచ్చట్లే అయ్యాయి. 340, 350, 370, 400 ఇలా ఒక్కో ఎగ్జిట్ పోల్ ఒక్కో నెంబర్ ప్రకటించాయి. కానీ.. ఎగ్జాక్ట్ పోల్స్ వచ్చాక గానీ.. అసలు తత్వం బోధపడలేదు రాజకీయ నేతలు, ప్రజలకు. ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సంతగి అటుంచితే..

దేశానికి తదుపరి ప్రధాని ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పదేళ్లు అప్రతీహతంగా దేశాన్ని ఏలిన నరేంద్ర మోదీ.. ఇప్పుడు మరోసారి ఆ పదవిని అధిరోహిస్తారా? లేదా? అనేది సందేహాత్మకంగా మారింది. అవును.. బీజేపీకి మేజిక్ ఫిగర్ సీట్లు రాకపోవడం, ఎన్డీయే కూటమిలో రెండు, మూడు పార్టీల భాగస్వామ్యం కీరోల్ కావడం.. వారు మోదీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తారా? అనే సందేహాలు వ్యక్తమవతుండటంతో.. ఈ ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అవును.. ఎన్డీయే కూటమి 294 స్థానాల్లో గెలుపొందింది. ఈ కూటమిలో ఇప్పుడు నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ.. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కీలక పాత్ర పోషించనున్నాయి. ఎందుకంటే.. బీజేపీ సింగిల్‌గా 242 సీట్లలో మాత్రమే మెజార్టీ సాధించింది. అంటే ఈ పార్టీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలంటే ఇంకా 30 సీట్లు కావాల్సి(ప్రభుత్వ ఏర్పాటుకు మేజిక్ ఫిగర్ 272) ఉంటుంది. ఇందులో టీడీపీకి 16 సీట్లు, జేడీయూ 12 సీట్లలో గెలుపొందాయి. ఈ రెండూ పార్టీలకు కలిపి 28 సీట్లు ఉన్నాయి. 292లో ఈ రెండు పార్టీలవే 28 స్థానాలు పోతే.. మిగిలిన 264 సీట్లు ఎన్డీయేకి ఉంటాయి. అంటే మేజిక్ ఫిగర్‌కు 8 సీట్లు తక్కువ అనమాట. అందుకే ఈ రెండు పార్టీలు ఇప్పుడు ఎన్డీయే కూటమిలో కీరోల్ పోషించనున్నాయి. అంతేకాకుండా.. ఎన్డీయేలోని మరికొన్ని చిన్నా చితకా పార్టీలు కూడా మోదీ ప్రధాని అభ్యర్థిత్వంపై అభ్యంతరం తెలిపే అవకాశం ఉంది.

– మోదీని మార్చాలని కోరే అవకాశం..

వాస్తవానికి ఎన్డీయే కూటమిలోని చాలా పార్టీలు మోదీ ప్రధాని అభ్యర్థిత్వంపై అంతర్గతంగా తీవ్ర అసంతృప్తితో ఉంటూ వస్తున్నాయి. కానీ, ప్రజల్లో ఉన్న పాపులారిటీ కారణంగా.. ఆ అసంతృప్తిని బయటకు చెప్పలేకపోవడం, అధికారాన్ని వదులుకోవడం ఇష్టం లేని కారణంగానూ వెల్లడించలేదు. కానీ, ఇప్పుడు పరిస్థితి అలా లేదు. బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవ్వాలంటే కూటమిలో ప్రతి పార్టీ కీలకమే. అందుకే.. వారు చెప్పినట్లు బీజేపీ వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులను చూస్తుంటే మాత్రం ఈసారి మోదీ నాయకత్వాన్ని తీవ్ర వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. కూటమిలోని ఆయా పార్టీలు మోదీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా ప్రధాని పదవిపై ఎప్పటి నుంచో కన్నేసిన.. జేడీయూ నేత నితీష్ కుమార్ ఈ విషయంలో ముందుంటారనే టాక్ నడుస్తోంది. అయనే కాదు.. మిగతా పార్టీలు కూడా మోదీకి బదులుగా మరొకరి పేరును ప్రతిపాదించాలని కోరే ఛాన్స్ ఉంది. ఈ కారణంగానే.. ఇప్పుడు దేశ తదుపరి ప్రధాని ఎవరు? అనే డిస్కషన్ బలంగా వినిపిస్తోంది. మరి దొరికిన అవకాశాన్ని వినియోగించుకుని.. ఎన్డీయే కూటమిలోని మోదీ వ్యతిరేకులంతా ఏకమవుతారా? లేక ఎలాగైతేనేం తమ ప్రభుత్వం ఏర్పడితే చాలు అని మోదీకే జై కొడతారా? అనేది ఇంట్రస్టింగ్‌గా మారింది. ఈ వ్యవహారం తేలాలంటే ఒకటి రెండ్రోజులు ఎదురు చూడాల్సిందే.

## బలంగా మారిన హైదరాబాద్ పోలీస్ శాఖ




మొదటి పేజీ తరువాయి నియామకంతో పాటు సరికొత్త టెక్నాలజీ వినియోగంలోకి తీసుకొచ్చింది. రాష్ట్ర పోలీసులు మహిళా భద్రతకు ప్రాధాన్యమిస్తూ ముందుకెళ్తున్నారు. మహిళా భద్రతా విభాగం షీ టీమ్స్ ఏర్పాటు సహా అనేక మార్పులు వచ్చాయి. అదేవిధంగా ప్రస్తుతం పెరుగుతున్న నేరాల్లో ఒకటైన సైబర్ క్రైమ్, డ్రగ్స్ పట్టుబడటానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటయ్యాయి. హైదరాబాదుకు మణిహారంగా ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్ తెలంగాణ పోలీస్ ప్రతిష్టను మరింత పెంచింది.పోలీస్ శాఖను బలోపేతం చేసేలా ఇప్పటికే 27,000 మంది నూతన సిబ్బంది నియామకం పూర్తి చేసింది. ఇటీవల నోటిఫికేషన్?లో భర్తీ అయిన 414 సివిల్ ఎస్సైలు, మరో 16,450 ఆరు పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయి శిక్షణ కొనసాగుతోంది. ఈ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుండడంతో మహిళా పోలీసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పోలీసు సంక్షేమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులకు 30శాతం రిస్క్ అలవెన్సన్ కూడా వస్తున్నాయి. తెలంగాణ ఏర్పడకముందు నెలకు రూ.12,000 ఉన్న హోంగార్డులకు జీతాలు ఇప్పుడు రూ.20 వేలకు పెరిగాయి. ఇంక్రిమెంట్ ప్రకటనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18,491 మంది హోంగార్డుల కుటుంబాలకు లబ్ధి చేకురుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్ బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 12లో ఏర్పాటు చేసినటువంటి కమాండ్ కంట్రోల్ సెంటర్?ను రూ.600 కోట్లతో నిర్మించారు. ఇది మొత్తం 19 అంతస్తుల్లో ఏర్పాటు చేశారు. 2022 నుంచి ఈ భవనం అందుబాటులోకి వచ్చింది. పోలీసులు రోజువారీ విధుల్లో ఎక్కువగా టెక్నాలజీని ఉపయోగిస్తూనే ఉన్నారు. 56 రకాల సర్వీసులతో రాష్ట్రస్థాయిలో టీఎస్ కాప్ యాప్?ను తీసుకొచ్చింది. మరోవైపు మహిళా భద్రత కోసం తొలుత 2014 అక్టోబర్ 24న షీ టీమ్స్ ఏర్పాటు చేశారు. తర్వాత మహిళా భద్రత కోసం రాష్ట్రస్థాయిలో ఉమెన్ సేఫ్టీ ఏర్పాటు చేశారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను కూడా ఏర్పాటు చేశారు. ఇలా దశాబ్దకాలంలో పోలీస్ శాఖ ఎంతో పటిష్టంగా మారింది.

# తెలంగాణలో అనూహ్య ఫలితాలు

మొదటి పేజీ తరువాయి పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. ఇక తెలంగాణలో కాషాయం పార్టీ గతంలో కన్నా మెరుగైన స్థానాలను చేజిక్కించుకుంది. 2019లో కేవలం నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకున్న బీజేపీ, ఈసారి 8 స్థానాలను కైవసం చేసుకుంది. కరీంనగర్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్‌లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. తెలంగాణ పార్లమెంట్ స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ డబుల్ డిజిట్ సాధించాలన్న ప్రయత్నాలను..మోదీ వేవ్‌తో కమలం పార్టీ దెబ్బకొట్టింది. అనూహ్యంగా సీట్ల సంఖ్యను పెంచుకుంది బీజేపీ. గతంలో జంటనగరాలు, రంగారెడ్డిజిల్లాలో సికింద్రాబాద్ ఎంపీ స్థానాన్ని మాత్రమే గెలుచుకున్న బీజేపీ.. ఈసారి సికింద్రాబాద్‌తో పాటు మల్కాజ్‌గిరి, చేవెళ్ల స్థానాలను సైతం కైవసం చేసుకుంది. ఇక హైదరాబాద్‌లో గట్టి అభ్యర్థిని బరిలో నిలిపినా ఎప్పటిలానే ఎమ్ఐఎమ్ తన పట్టు నిలుపుకుంది. కాగా, తెలంగాణలోని పార్లమెంట్ స్థానాల ఫలితాలను చూస్తే కాంగ్రెస్‌కు 40.5%, బీజేపీకి 34.5%, బీఆర్ఎస్‌కు 17.4% ఓట్ల శాతం దక్కినట్లు తెలుస్తుంది.

ఏ స్థానంలో ఎవరు గెలిచారంటే...

**– ఆదిలాబాద్‌లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 78వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.**

**– నల్గొండలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి 5.51లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు.**

**– ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి 4.56లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు.**

**– వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య 2.02లక్షల ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందారు.**

**– మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ 3.24లక్షల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.**

**– జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ 45వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.**

**– భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్ రెడ్డి 1.95లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు.**

**– నాగర్‌కర్నూలులో కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి 85వేలకు పైగా మెజార్టీతో గెలుపొందారు.**

**– నిజామాబాద్‌లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ 1, 27, 769 ఓట్లతో మెజార్టీ విజయం సాధించారు.**

**– కరీంనగర్ లోక్‌సభ సీటు నుంచి బీజేపీ నేత బండి సంజయ్ 2.12లక్షలకు పైగా ఓట్ల తేడాతో గెలుపొందారు.**

**– పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1.31లక్షలకు పైగా మెజార్టీతో విజయం సాధించారు.**

**– హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మాధవీలతపై 2,97,031 ఓట్ల తేడాతో అసదుద్దీన్ ఓవైసీ ఘనవిజయం సాధించారు.**

**– మెదక్ జిల్లాలో కాషాయ జెండా ఎగిరింది. రఘునందన్ రావు సమీప అభ్యర్థిపై అద్భుత విజయం సాధించారు.**

**– మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సుమారు 3 వేల మెజార్టీతో విజయం సాధించారు.**

**– చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి లక్షా 50 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.**

**– మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈటెల రాజేందర్ విజయకేతనం ఎగురవేశారు.**

**– సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి విజయం సాధించారు.**

# కవితకు బిగిస్తున్న ఉచ్చు

తేదీ వరకు పొడిగించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఈడీ కేసులో కవిత జుడీషియల్ రిమాండ్‌ను జూలై 3వ తేదీ వరకు న్యాయస్థానం పొడిగించింది.ఇక ఈ కేసులో కవితకు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఈడీ కీలక ఆధారాలు కోర్టుకు సమర్పించింది. లిక్కర్ కుంభకోణం మొత్తం విలువ రూ.1,100 కోట్లని తెలిపింది. ఇందులో కవితే కీలకమని పేర్కొంది. ఆప్ పార్టీకి లంచాలు ఇవ్వడంలో కవితే కీలకంగా వ్యవహరించారని, మధ్యవర్తిగా డబ్బులు ఇప్పించారని ఆరోపించిందిఇక మధ్యంతర చార్జిషీట్‌లో ఈడీ కవితకు వ్యతిరేకంగా 92 డాక్యుమెంట్లను ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. 292 కోట్ల వ్యవహారంలో కవితకు నేరుగా సంబంధం ఉందని తెలిపింది. ఇక కవితకు వ్యతిరేకంగా ఉన్న 92 సాక్షాలకు సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ కోర్టుకు సమర్పించింది. ఇదే సమయంలో ఈ కేసులో అప్రూవర్‌గా మారిన శరత్‌దంద్రారెడ్డి, అరుణ్ రామచంద్ర పిళ్లై తదితరులతోపాటు 44 మంది సాక్షుల వాంగ్మూలాలను కూడా ఈడీ కోర్టు ముందు ఉంచింది. ఈమేరకు చార్జిషీట కాపీని కోర్టు కవిత తరపు లాయర్లకు అందించిందిఇక కవిత నేరం చేసినట్లు తమ వద్ద అనేక ఆధారాలు ఉన్నాయని ఈడీ కోర్టుకు తెలిపింది. పీఎంఎల్ఏ కింద కవితను శిక్షించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో జూలై నుంచి ఈ కేజుకు సంబంధించి ట్రయల్స్ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.



మొదటి పేజీ తరువాయి

అయితే ఈ ట్రయల్స్ సుదీర్ఘంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇది కీలకమైన కేసు అయినందున వాదనలు కూడా సుదీర్ఘంగా జరుగుతాయని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.ఇక సీబీఐ కేసులో కూడా కవితకు మరో షాక్ తగలనుంది. త్వరలోనే కవిత కేసుకు సంబంధించి చార్జిషీట్ దాఖలు చేస్తామని సీబీఐ తరపు న్యాయవాదులు ప్రత్యేక కోర్టుకు తెలిపారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# కేంద్రంలో టీడీపీ చక్రం తిప్పుతుందా

- తారుమారైన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు
- ప్రభుత్వ ఏర్పాటులో ఉత్తరప్రదేశ్ చాలా కీలకం
- యూపీలో దారుణమైన పరిస్థితుల్లో బీజేపీ



విజయవాడ, తొలిఅడుగు : కేంద్రంలో అతికష్టం మీద ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి, ఇండియా కూటమికి మధ్య ఎవరు ఊహించని రీతిలో పోటీ నెలకొంది. 400 సీట్లు కచ్చితంగా సాధిస్తామన్న బీజేపీ నేతల అంచనాలు తారుమారయ్యాయి. 300 సీట్లు దాటేందుకు కూడా బీజేపీకి కూటమి అష్టకష్టాలు పడుతోంది. ప్రభుత్వ ఏర్పాటులో ఉత్తరప్రదేశ్ చాలా కీలకం. అక్కడ 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. అయితే యూపీలో చాలా దారుణమైన పరిస్థితుల్లో బీజేపీ ఉంది. యూపీలో మెజారిటీ సీట్లను ఇండియా కూటమి కైవసం చేసుకుంటోంది. సమాజ్‌వాదీ పార్టీ సత్తా చాటింది. ఇండియా కూటమి అక్కడ 45 సీట్లకు పైగా ఆధిక్యంలో ఉంది. పార్టీలో అంతర్గత కలహాలు పార్టీ కొంపముంచాయి. గత ఎన్నికల్లో 62 సీట్లలో గెలిచిన బీజేపీ ఈసారి మాత్రం 30కి పైగా సీట్లలో మాత్రమే ఆధిక్యంలో ఉంది. బిహార్‌లో మాత్రం ఎన్డీఏ కూటమికి కాస్త ఊరట లభించింది. ఇండియా కూటమిపై అక్కడ బీజేపీ కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వాస్తవానికి ఇక్కడ కూడా ఇండియా కూటమికి ఆధిక్యం లభిస్తే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం దక్కేది. కాంగ్రెస్ మాత్రం ఈ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుంది. 2024 ఎన్నికల తరువాత 100 సీట్లకు చేరువలో కాంగ్రెస్ ఉంది. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ దేశవ్యాప్త ప్రచారం పార్టీకి బాగా కలిసివచ్చింది. గతంలో పోలిస్తే మైనారిటీ ఓట్లను తమవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ నేతలు సక్సెస య్యారు. ముఖ్యంగా బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారన్న ప్రచారం బాగా కలిసి వచ్చింది. యూపీ , మహారాష్ట్రలో ఇండియా కూటమి ఆధిక్యం బీజేపీ కొంపముంచింది. ఉద్దవ్ వర్గం తమదే అసలైన శివసేన నిరూపించుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో రైతుల ఆందోళనలు బీజేపీ కొంపముంచినట్టు ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. పంజాబ్, హర్యానా, యూపీ , రాజస్థాన్‌లో బీజేపీ గ్రాఫ్ తగ్గడానికి రైతుల వ్యతిరేకతే ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ఇక కొత్తగా ఏర్పాటయ్యే ఔఆం ప్రభుత్వంలో టీడీపీ, జేడీయూ కీలక పాత్ర పోషించబోయే అవకాశం కనిపిస్తుంది. ఎన్డీయేలో రెండవ అతి పెద్ద పార్టీగా టీడీపీ పాగా వేసే సూచనలు ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్రంలో కూడా టీడీపీ చక్రం తిప్పే చాన్స్ ఉంది.

# ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటాం


మొదటిపేజీ తరువాయి

చారు. పార్టీ స్థాపించి 24 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో అన్ని రకాల ఎత్తుపల్లాలను చూశామన్నారు. అద్భుతమైన విజయాల తోపాటు అనేక ఎదురుదెబ్బలు, ఎదుర్కొన్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే మాకు అతి పెద్ద గౌరవమన్నారు. ఒక ప్రాంతీయ పార్టీగా వరుసగా రెండుసార్లు అద్భుతమైన మెజార్టీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. 2014లో 63 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, 2018లో 88 అసెంబ్లీ స్థానాలతో రెండవసారి ప్రభుత్వాన్ని విజయవంతంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం శాసనసభలో 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నాం. ప్రజా పక్షాన పోరాడేందుకు అవకాశమిచ్చారన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతామన్నారు. ఈరోజు వచ్చిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కచ్చితంగా నిరాశను కలిగించాయన్నారు. అయినా ఎప్పటిలాగే మరింత కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విశ్వాసం ఉందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫీనిక్స్ పక్షి లెక్క తిరిగి పుంజుకుంటామన్నారు. కాగా, తెలంగాణలో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్యమ పార్టీగా చెప్పుకునే బీఆర్ఎస్ పార్టీ క్రమంగా తమ పట్టును రాష్ట్రంలో కోల్పోతోంది. గత ఎన్నికల్లో బీజేపీ 4 స్థానాలకే పరిమితిమవ్వగా.. ఈ ఎన్నికల్లో ఆ సంఖ్యను డబల్ చేసుకునేలా కనిపిస్తోంది.

## 5 నెలల రేవంత్ రెడ్డికి నాయకత్వంలో

# కాంగ్రెస్ ప్రభుత్వ ప్రశంస గా భావిస్తున్నాం



కరీంనగర్, ప్రభాత సూర్యుడు : కరీంనగర్ డిసిసి కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యేలు- అది శ్రీనివాస్ కవ్వంపల్లి సత్యనారాయణ- కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్ తలకిందులు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి ఫలితాల పై యావత్ కాంగ్రెస్ కార్యకర్తలంతా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాం.. కరీంనగర్ లోక్ సభ నుండి ప్రతి ఒక్కరం ఇండియా కూటమి నాయకత్వానికి ముఖ్యంగా మా నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు ఖర్గే , సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి సభ్యులకు హృదయ పూర్వకఅభినందనలు తెలుపుతున్నాం. దేశ వ్యాప్తంగా ఉన్న చానెల్స్ అన్ని ఇండియా కూటమి కి సీట్లు రావని ఎగ్జిట్ పోల్స్ ఇచ్చాయి..! అందరి అంచనాలు తల కింధులు చేస్తూ బీజేపీ ముఖ్యమంత్రులను అరెస్టు చేసిన ఈడిలను ఉపయోగించుకొని మొత్తం ప్రతిపక్షాలను గొంతు నొక్కే ప్రయత్నంచేసి భయభ్రాంతులకు గురి చేసిన ప్రజాస్వామ్యం బతకాలని ఇండియా కూటమి సభ్యులను ఇంత పెద్ద ఎత్తున గెలిపించిన వారికి ప్రజాస్వామ్యం పట్ల వారికున్న ప్రేమ స్పష్టం అవుతోంది. తెలంగాణ లో కూడా సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో ఎమ్మెల్యే గా గణేష్ 10 వేల పైచిలుకు మెజారిటీ తో గెలవడం 5 నెలల రేవంత్ రెడ్డికి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రశంస గా భావిస్తున్నాం. గణేష్ గెలుపుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. కరీంనగర్ లోక్ సభ లో రాజేందర్ రావు గెలుపు కోసం ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు, మండల అధ్యక్షులు, బూత్ ఇంచార్జి లు, కార్యకర్తలు అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసారు.. మూడు దఫాలుగా ముఖ్యమంత్రి పర్యటనకు హుజురాబాద్ కి ఒకసారి, సిరిసిల్ల సభ కి రాహుల్ గాంధీ నామినేషన్ ఉన్న కారణంగా ముఖ్యమంత్రి ఆలస్యంగా రావడం, వర్షం వల్ల సభ రద్దయింది. రాహుల్ గాంధీ ఇతర కార్యక్రమాల వల్ల రాకపోయినా కార్యకర్తల కృషితో రాజేందర్ రావు 3 లక్షల 54 వేల పై చిలుకు ఓట్లు రావడం కార్యకర్తల కృషి .గతంలో ఎంపిగా చేసిన ఆయన లక్ష ఓట్లు కోల్పోయి మూడవ స్థానానికి పరిమితం అయ్యారు. బీజేపీ గెలిచిన అభ్యర్థి మతపరమైన విద్వేషాలు మాని ప్రజా సమస్యల పై దృష్టి సారించాలి. నరేంద్ర మోడీ ప్రభావం తమిళనాడు లో పని చేయలేదు. పనిచేసిన దగ్గర ఇలాంటి మెజారిటీ వచ్చింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గెలిచిన ఎంపి మతపరమైన అంశాలకు, విద్వేషాలను కరీంనగర్ పరిమితం కావద్దని అభివృద్ధి పరిమితం కావాలని గెలిచిన ఎంపి కి మా అందరి తరుపుతున్న శుభాకాంక్షలు చెబుతున్న.. ఉమ్మడి జిల్లాలో 8 మంది ఎమ్మెల్యేలుగా గెలిచాం, కరీంనగర్ లోక్ సభ నుండి నలుగురు ఎమ్మెల్యేలం గెలిచాం. రాబోయే కాలంలో ఈ లోక్ సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్టంతో కాంగ్రెస్ కంచుకోట గా చేసుకుంటాం. కాంగ్రెస్ కార్యకర్తలు అధర్య పడవద్దు, కాంగ్రెస్ పార్టీ నైతిక గెలుపు, కాంగ్రెస్ పార్టీ లేదని చెప్పిన ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరూ మాజీ మంత్రులు దగ్గర కూడా వారికి మెజారిటీ రాని పరిస్థితి. బిఆర్ఎస్ ఓట్లు అడగని పరిస్థితి. మీ అందరి కష్టం తో 3 లక్షల 54 వేల ఓట్లు సాధించాం, భవిష్యత్ లో మండలాలు, మున్సిపాలిటీ లు, వార్డు మెంబర్లు కూడా కాంగ్రెస్ గెలుచుకుంటుందని అన్నారు.

# ఏపీలో కూటమి అఖండ విజయం


మొదటిపేజీ



జోరుగా కొనసాగుతున్నాయి. చంద్రబాబు కుటుంబ సభ్యులు కేకట్ కట్ చేసుకుని సంబరాలు చేసుకుంటున్నారు. కూటమి కట్టినప్పుడే సగం విజయం ఖాయమై పోయిందని అప్పుడే భావించాయి టీడీపీ, జనసేన, బీజేపీ. ఇప్పుడు వాళ్ల అంచనాలు అక్షరాలా నిజమవుతున్నాయి. కూటమి విజయకేతనం ఎగరవేస్తోంది. ఇంతకీ కూటమికి కలిసొచ్చిన అంశాలేంటి? చంద్ర బాబు అరెస్ట్ అంశం చాలా పెద్ద ఎఫెక్ట్ చూపించిందని సర్వత్రా వినిపిస్తోంది. సైలెంట్‌గానే ఈ విషయం వైసీపీకి పెద్ద దెబ్బ వేసినట్లు కనిపిస్తోంది. ఇది టీడీపీకి సానుకూల అంశం అనే వాదన వినిపిస్తోంది.

- బద్వేల్ లో తెలుగుదేశం పార్టీ సంబరాలు
- పెద్ద ఎత్తున వచ్చిన నాయకులు కార్యకర్తలు

బద్వేలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంబరాలు ఘనంగా జరుపుకున్నారు మంగళవారం వచ్చిన ఓట్ల లెక్కింపులో తెలుగుదేశం పార్టీ చరిత్ర సృష్టించడం కూటమి అభ్యర్థులు 165 స్థానాల్లో విజయం సాధించడం మెజార్టీ పార్లమెంట్ స్థానాలు కూటమి అభ్యర్థులు గెలుచుకోవడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు బద్వేలు తెలుగు దేశం పార్టీ యువనేత రితేష్ రెడ్డిని పలువురు కలిసి అభినందనలు తెలిపారు అభినందనలు తెలిపిన వారిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ సూర్యనారాయణ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ రంతు మాజీ సర్పంచులు రామచంద్రారెడ్డి సింగరయ్య మహిళా నాయకురాలు ఝాన్సీ సీనియర్ న్యాయవా దులు ప్రసాద్ నరసింహులు బద్వేలు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంగళరెడ్డి అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికా ర్జున్ రెడ్డి పెద్ద పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.

ఎడిటోరియల్ EDITORIAL

# మోడీ సర్కార్ హ్యాట్రిక్

ప్రభాత సూర్యుడు, డెస్క్ : పదేళ్ల నుంచి బిజెపి అధికారంలో ఉంది. ఈసారి కూడా అధికారాన్ని దక్కించుకొని హ్యాట్రిక్ సాధించాలని భావించింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' నినాదంతో ఎన్నికల బరిలోకి దిగిన ఎన్డీయే.. 300 మార్క్ సీట్లలో ఆధిక్యం ప్రదర్శిస్తోంది. గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో దాదాపు క్లీన్ స్వీప్ దిశగా సాగుతోంది. యూపీ, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్ లాంటి పెద్ద రాష్ట్రాల్లో నెక్ టు నెక్ ఫైట్ నడుస్తోంది.దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఇండియా కూటమి హవా కొనసాగుతోంది. అక్కడి 80 స్థానాల్లో మెజారిటీ స్థానాలు కూటమి కైవసం చేసుకోబోతుంది.. ఇప్పటికే 40కి పైగా స్థానాల్లో ఇండియా కూటమి ఆధిక్యం కనబరుస్తోండగా.. బీజేపీ 36 స్థానాల్లో మాత్రమే లీడింగ్ లో ఉంది. గత ఎన్నికల్లో 62 స్థానాలు ఈ రాష్ట్రం లోనే గెలిచిన బీజేపీకి, ఈ సారి ఎదురు గాలి వీస్తోంది. మహారాష్ట్రలో మొత్తం 48 స్థానాలు ఉండగా.. ఎన్డీయే, ఇండియా కూటముల మధ్య టఫ్ ఫైట్ నడుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన కౌంటింగ్ లో 26 స్థానాల్లో ఎన్డీయే, 20 స్థానాల్లో ఇండియా కూటమి ఆధిక్యంలో ఉంది. వెస్ట్ బెంగాల్ లోనూ తృణమూల్ కాంగ్రెస్ హవా కనిపిస్తోంది.. గత ఎన్నికల్లో 22 స్థానాలు సాధించిన టీఎంసీ.. ఈ సారి కూడా 22 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అయితే, 2019 ఎన్నికల్లో 18 స్థానాలు గెలిచిన బీజేపీ మాత్రం 12 స్థానాల్లోనే లీడింగ్ లో ఉంది..మెజారిటీ స్థానాలు సాధించాల్సిన పెద్ద రాష్ట్రాల్లోనే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో.. భారీ మెజారిటీపై అంచనాలు పెట్టుకున్న ఎన్డీయే 3 వందల స్థానాల దగ్గరే ఆగి పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.మరో వైపు కాంగ్రెస్ ఇండియా కూటమిగా ఏర్పడి.. కచ్చితంగా బిజెపిని ఓడించి, అధికారాన్ని దక్కించుకోవాలని అంచనా వేసింది. అయితే ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఎన్డీఏ కూటమి వైపు మొగ్గు చూపించాయి. అయితే వాస్తవ ఫలితాలలో ఆ విషయం ప్రతిబింబించడం లేదు. వార్ వన్ సైడ్ అన్నట్టుగా లేదు.. అలాగని కాంగ్రెస్ కు అధికారం దక్కే పరిస్థితి లేదు. ప్రస్తుతం ట్రెండ్ ప్రకారం చూసుకుంటే.కర్ణాటక రాష్ట్రంలో ఎన్డీఏ 17 స్థానాలలో ముందంజలో ఉంది. కాంగ్రెస్ 11 స్థానాలలో పై చేయి సాధించింది.. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్ రేవణ్ణ కూడా ముందంజలో ఉన్నాడు. రాజస్థాన్లో 25 పార్లమెంటు స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో ఇక్కడ అన్ని స్థానాలను ఎన్డీఏ కూటమి గెలుచుకుంది. అయితే ఈసారి ఇక్కడ ఎన్డీఏ 13, కాంగ్రెస్ 11 స్థానాలలో లీడ్ లో కొనసాగుతున్నాయి..ఢిల్లీలో మొత్తం ఏడు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఉన్న ట్రెండ్ ప్రకారం ఆరు స్థానాలలో బిజెపి ముందంజలో ఉంది. ఇండియా కూటమి ఒకే ఒక్క స్థానంలో లీడ్ లో కొనసాగుతోంది.

దేశంలోనే అత్యధిక పార్లమెంటు స్థానాలు ఉన్న ఉత్తర ప్రదేశ్ లో.. ఎన్డీఏ, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. 80 పార్లమెంటు స్థానాలు ఉన్న ఈ రాష్ట్రంలో.. గత ఎన్నికల్లో బిజెపి 69 స్థానాలు దక్కించుకుంది. కానీ ఈసారి 38 స్థానాలలో బిజెపి, 41 స్థానాలలో ఇండియా కూటమి, ఒకేఒక్క స్థానంలో ఇతరులు లీడ్ లో కొనసాగుతున్నారు.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కాంగ్రెస్ కూటమి, ఎన్డీఏ మధ్య పోరు రసవత్తరంగా ఉంది.. 42 స్థానాలు ఉన్న ఈ రాష్ట్రంలో ఎన్డీఏ 16, ఇండియా కూటమి 26 స్థానాలలో ఆధిక్యం లో కొనసాగుతున్నాయి. బిజెపి ఈ రాష్ట్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ.. మమతా బెనర్జీ పై చేయి సాధించారు.ఇక ప్రస్తుత ట్రెండ్స్ ప్రకారం ఎన్డీఏ కూటమి 277 స్థానాలలో లీడ్ లో ఉంది. 13 స్థానాలలో సాధించింది. కాంగ్రెస్ 189 స్థానాలలో ఆధిక్యంలో ఉంది. ఏడుగురు అభ్యర్థులు ఎంపీలుగా విజయం సాధించారు. ఇతరులు 56 స్థానాలలో లీడింగ్ లో ఉన్నారు.4: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లో తీవ్రంగా నష్టపోయిన బీజేపీ అధికారంలో లేని ఒడిశా, ఢిల్లీ, బిహార్‌లో సత్తా చాటుతోంది. ట్రెండ్స్ చూస్తుంటే బిహార్‌లో ఎన్డీఏ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ఢిల్లీ, మధ్య ప్రదేశ్‌లో బీజేపీ ఒంటరిగా క్లీన్‌స్వీప్ చేస్తోందిబిహార్‌లో 40 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ జేడీయూ 25 స్థానాల్లో, బీజేపీ 15 స్థానాల్లో పోటీ చేశారు. అన్ని స్థానాల్లో ఎన్‌డీఏ ఆధిపత్యం కనబరుస్తోంది.ఇక ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉంది. ఇక్కడ ఏడు లోక్‌సభ స్థానాలు ఉండగా ఆరింటిలో ఆప్, ఒక స్థానంలో కాంగ్రెస్ పోటీ చేశాయి. అన్ని స్థానాల్లో బీజేపీ ఆధిక్యం కనబరుస్తోంది. లిక్కర్ స్కామ్ ప్రభావం ఇక్కడి ఎన్నికలపై స్పష్టంగా పడింది.ఇక మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది. అధికారంలో ఉన్న రాష్ట్రాలతో పోలిస్తే మధ్యప్రదేశ్‌లోనే బీజేపీ తన పట్టు నిలుపుకుంది. యూపీ, రాజస్థాన్‌లో బీజేపీ పట్టు సడలింది. మధ్యప్రదేశ్‌లో మాత్రం 25 స్థానాలకు 25 గెలిచేలా ట్రెండ్స్ వస్తున్నాయి.4: దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ మెజారిటీ స్థానాలను బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. 2024లో మాత్రం ఇక్కడి ఫలితాలు బీజేపీకి షాక్ ఇస్తున్నాయి. ప్రస్తుత ట్రెండ్స్ చూస్తుంటే? ఇండియా కూటమి ఆధిక్యత కనబరుస్తోంది. 2019లో 80 స్థానాలకు 62 స్థానాలు గెలిచింది. ఎన్డీ కూటమికి చెందిన అప్నాదల్ 2 స్థానాల్లో గెలిచింది. మాయావతి ఒంటరిగా పోటీ చేసి 10 స్థానాలు గెలిచింది. సమాజ్‌వాదీ పార్టీ 5, కాంగ్రెస్ ఒక్క సీటు గెలిచాయి.

# రాష్ట్ర ప్రజల కష్టాలే నా కష్టాలుగా భావించా

**- కోట్ల మంది అభిమానం ఏమైందో - వైసీపీ ఓటమిపై స్పందించిన జగన్మోహన్ రెడ్డి**



అమరావతి, ప్రభాత సూర్యుడు : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు చోటుచేసుకున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్డీయే కూటమి ప్రభంజనం కొనసాగింది. ఏపీ ఫలితాలు వైసీపీకి దిమ్మతిరిగే షాక్ ఇచ్చాయి. మంత్రులు అందరూ ఓటమి పాలైయారు. 175 సీట్లకు గాను కేవలం 10 స్థానాలతో సరిపెట్టుకుంది వైసీపీ. ఇంత ఘోరమైన ఓటమి నేపథ్యంలో వైఎస జగన్మోహన్ రెడ్డి స్పందించారు. ఏపీ ఎన్నికల ఫలితాలు ఆశ్చరం కలుగించాయన్నారు. ఫలితాలు ఇలా వస్తాయని ఊహించలేదన్నారు. అమ్మఒడి, 53 లక్షల మంది తల్లులకు, రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని అడుగులే వేశామన్నారు. అక్కాచెల్లెమ్మల ఓట్లు ఏమయ్యాయో అర్థం కావడం లేదన్నారు. అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు గతంలో ఎన్నడూ జరగని విధంగా మేలు చేశామన్న జగన్, వారి కష్టాన్ని అర్థం చేసుకుంటూ.. వారి ఇంటికి పంపే వ్యవస్థను కూడా తీసుకువచ్చామన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలనే మా కష్టాలుగా భావిస్తూ.. ఇచ్చిన ఏ మాట తప్పకుండా అన్ని రకాలుగా వారికి అండగా ఉన్నామని జగన్ తెలిపారు. చేయూతతో ప్రతి ఒక్కరికి భరోసా కల్పించామన్న జగన్, వారి ప్రేమాభిమానాలు ఏమయ్యాయోనని జగన్ ప్రశ్నించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన 99 శాతం హామీలు అమలు చేశామన్న జగన్, సామాజిక న్యాయం చేసి చూపించామన్నారు. కోట్ల మంది ప్రజల అభిమానం ఏమైందో తెలియడం లేదన్నారు. మంచి చేయడానికి ప్రజలకు తోడుగా ఉంటామన్న జగన్, పేదలకు ఎప్పుడూ వైసీపీ అండగా ఉంటుందన్నారు. ఢిల్లీ లెవల్ కూటమి కట్టిన పెద్దలు ఎన్నికల్లో ఏం చేశారో దేవుడికే తెలియాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ సహా కూటమి నేతలకు అభినందనలు తెలిపిన జగన్, ప్రతిపక్షంగా ఉండటం కొత్తేమీ కాదన్న ఆయన, ప్రజల పక్షాన పోరాడేందుకు సిద్ధమన్నారు.

# పంటల రక్షణ కోసం వినూత్న ఏర్పాట్లు



నిజామాబాద్, ప్రభాత సూర్యుడు : రైతు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాలి. పొలంలో విత్తు విత్తింది మొదలు పంట దిగుబడి చేతికొచ్చే వరకూ రేయింబవళ్లు కంటికి రెప్పలా సంరక్షించాలి. వేలకు వేలు పోసి రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఒక వైపు అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలు పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంటే.. మరోవైపు ఆ పంటపై జంతువులు, పక్షుల బెడద గోరు చుట్టుపై రోకలి పోటులా మారాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ఎవరికి తోచిన విధంగా వారు పంట సంరక్షణ కోసం పలు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. కొందరు కోతుల బెడదతో శబ్దాలు వినిపించేలా మైకులు ఏర్పాటు చేస్తే ఇంకొందరు పక్షుల బెడద లేకుండా పాలిథిన్ కవర్లు పంటపై ఉంచి కాపాడుకుంటున్నారు.పంటల సాగుకు వాతావరణంతో పాటు జంతువులు, పక్షుల బెడద తప్పడం లేదు. వాతావరణం అనుకులించి పంటలు సాగు చేసినా రైతులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలను జంతువులు, పశువులు, పక్షుల నుంచి కాపాడుకునేందుకు అనేక రకాలుగా పాట్లు పడుతున్నారు. వినూత్నంగా ఆలోచిస్తూ పంట చేనుల్లో కొత్త పరికరాలను, కొత్త కొత్త పద్ధతులను అవలంబిస్తూ పక్షులు, జంతువులు అటువైపు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రైతులు జొన్న పంట కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడ గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్నారు.వీరిలో కొందరు జొన్న పంటలను సాగుచేస్తున్నారు. అయితే ఉదయం, సాయంత్రం సమయంలో పక్షులు, కోతులు, ఇతర జీవులు పంట చేనులపై పడి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పంటలను కాపాడుకోవాలనే లక్ష్యంతో రైతులు జొన్న కంకుల వద్ద పాలిథిన్ కవర్లు ఉంచుతున్నారు. ఈ కవర్లు ఏర్పాటు చేయడం వల్ల గాలి శబ్దానికి కవర్లు ఊగుతున్నాయి. దీని వల్ల పక్షులు పంటను నాశనం చేసే అవకాశం ఉండదని వీరి ఆలోచన. ఆ ఆలోచన అమలు చేసాక పక్షులు జొన్న పంట వైపు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఇందుకోసం పెద్ద ఖర్చు లేకపోవడం, పాలిథిన్ కవర్లు ఎక్కడ పడితే అక్కడ విరివిగా లభించే అవకాశం ఉండటంతో రైతులు ఈ పద్ధతిలో పంటను పక్షుల నుంచి కాపాడుకొంటున్నారు.

# ఇంటర్ క్లాసులు ఆరంభం

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు ముగియడంతో.. ఇంటర్ తరగతులు ప్రారంభంకానున్నాయి. తెలంగాణలో ఇంటర్ మొదటిదశ ప్రవేశాల ప్రక్రియ మే 9న ప్రారంభమై.. మే 31తో ముగిసింది. జూన్ 30 నాటికి మొదటిదశ ప్రవేశ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. మొదటిదశ ప్రవేశాలు పూర్తికాగానే.. రెండోదశ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. మరోవైపు ఏపీలో మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ మే 22 నుంచి ప్రారంభంకాగా.. జూన్ 1 వరకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. కళాశాలల రీఓపెనింగ్‌కు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇంటర్ అధికారులు చేశారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తున్న నేపథ్యంలో మొదటివారమంతా.. ప్రభుత్వ, గురుకుల కాలేజీలతోపాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో హాజరుశాతం తక్కువగానే ఉండనుంది. జూన్ రెండోవారం నుంచి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంది.తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో జూన్ చివరి వరకూ క్లాసులు జరిగే అవకాశం లేదు. మరోవైపు ప్రైవేట్ కాలేజీల్లో ఇప్పటికే దాదాపు ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యింది. రెండో సంవత్సరం క్లాసులు కూడా ఇప్పటికే ప్రారంభించారు. మొదటి సంవత్సరం తరగతులు కూడా అనధికారికంగానే నడుస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 3 వేలకుపైగానే జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 422 వరకు ప్రభుత్వ కాలేజీలు ఉన్నాయి. ఇక గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు తీసేస్తే 1400 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటన్నింటికీ ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. ఇప్పటికే చాలావరకు గుర్తింపు ప్రక్రియ పూర్తికాగా.. సరైన డాక్యుమెంట్లు సమర్పించని కారణంగా ఇంకా 600 ప్రైవేట్ కాలేజీలకు గుర్తింపు దక్కలేదు. అనుమతి రాకముందే.. ఆయా కాలేజీలు ప కొనసాగించినట్టు తెలుస్తోంది. ఒక్కో కాలేజీ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేశాయి. వేల సంఖ్యలో విద్యార్థులను చేర్చుకున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 72వేల మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులుంటే, ప్రైవేటు కాలేజీల్లో 2.35 లక్షల మంది ఉన్నారు. ఆఖరిదశ వరకూ అప్లియేషన్ల ప్రక్రియ కొనసాగించడం వల్ల ప్రతీ సంవత్సరం విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు.

**లెక్చరర్ల కొరత..**

ఇంటర్ తరగతులు ప్రారంభమవుతున్నా.. ఇప్పటివరకు కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ ప్రక్రియ చేయనేలేదు. ఇప్పటి వరకు కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెన్యువల్ చేయలేదు. కనీసం రెన్యువల్‌కు ఇంటర్ బోర్డు ప్రతిపాదనలు కూడా పంపలేదని తెలిసింది.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215